క్లుప్తంగా

ఫిజియోథెరపీతో వైకల్యం దూరం



చిన్నారులకు ఫిజియోథెరపీ చేస్తున్న నిపుణులు

బొంరాస్‌పేట: బాల్యదశలో చిన్నారులకు ఫిజియోథెరపీ చేయిస్తే వైకల్యాన్ని దూరం చేయొచ్చని సీఆర్‌టీ వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆయా గ్రామాల శారీరక వైకల్యం కలిగిన చిన్నారులకు నిపుణులతో ఫిజియోథెరపీ చేయించారు. వైకల్యం ఉన్న చిన్నారులకు ఎలా చేయాలో వారు తల్లిదండ్రులకు మెళకువలు తెలియజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పీఆర్టీయూ మండల అధ్యక్షుడు భీమప్ప



సభ్యత్వ నమోదు చేస్తున్న సంఘం నాయకులు

దౌల్తాబాద్: మండలంలోని సురాయిపల్లి, చల్లాపూర్, దౌల్తాబాద్, ఈర్లపల్లి గ్రామాల్లో మంగళవారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు భీమప్ప మాట్లాడుతూ సెప్టెంబర్ 1న సీపీఎస్ విధానంపై హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి సంఘం ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి పెంట్యానాయక్, గౌరవ అధ్యక్షుడు భీంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యం

ఎంఈఓ వెంకట్



గ్రంథాలయ గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంఈఓ వెంకట్ తదితరులు

దోమ: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని ఎంఈఓ వెంకట్ పేర్కొన్నారు. మంగళవారం దోమ మండల పరిధిలోని దాదాపూర్ పాఠశాలలో ల్యాబ్‌తో పాటు గ్రంథాలయ గదుల నిర్మాణానికి ప్రధానోపాధ్యాయుడు అమర్నాథ్, గ్రామస్తులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ కింద ఎంపికైన పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ డబ్ల్యూఐడీసీ ఏఈ పరుశురాం, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ అనసూయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఒకే సంఘానికి పనిచేయడం బాధాకరం

కుల్కచర్ల: ఎంఈఓ అబీబ్ అహ్మద్ ఒకే ఉపాధ్యాయ సంఘానికి అనుకూలంగా పనిచేయడం బాధాకరమని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాములు పేర్కొన్నారు. ఈ విషయంలో అతనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యావ్యవస్థ ఉన్నతికి అందుబాటులో ఉంటూ రాజకీయాలకతీతంగా, సంఘాల కార్యక్రమాలకు దూరంగా ఉండాల్సిన మండల విద్యాధికారి ఒక ఉపాధ్యాయ సంఘానికి మద్దతుగా ఉండి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఇలాంటి కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు.

సన్నవడ్ల బోనస్ డబ్బులు చెల్లించాలి

దోమ: రైతులకు సన్న వడ్ల బోనస్ డబ్బులు చెల్లించాలని మండల సర్పంచుల సంగం మాజీ అధ్యక్షుడు కె.రాజిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రబీ సీజన్లో రైతులు పండించిన సన్న రకం ధాన్యాన్ని సేకరించేందుకు మోత్కూర్, దిర్సంపల్లి గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ సంస్థల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించామన్నారు. ఆ సమయంలో మండల వ్యాప్తంగా రైతులు ముప్పై నాలుగు వేల బ్యాగులకు పైగా విక్రయించారాని తెలిపారు. దానికి సంబంధించిన బోనస్ నేటికీ అందలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోనస్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కట్టెల పొయ్యిపైనే వంట

- వర్షాకాలంలో కూడా అదే పరిస్థితి
- సర్కారు బడుల్లో నిర్వాహకుల తిప్పలు
- ప్రతిపాదనలకే పరిమితమైన వంటగ్యాస్ సిలిండర్లు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న సిబ్బంది
- పట్టించుకోని అధికారులు



బాలంపేట పాఠశాలలో కట్టెల పొయ్యిపై మధ్యాహ్న భోజనం వండుతున్న నిర్వాహకులు

దౌల్తాబాద్: సర్కారు బడుల్లో నిర్వహించే మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వంటలు కట్టెల పొయ్యిపైనే వండాల్సివస్తోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న నిర్వాహకులకు ఏళ్ల తరబడి కట్టెల పొయ్యే దిక్కుగా మారింది. వర్షాకాలంలో కూడా వంట చేయాలంటే తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. వర్షాలకు కట్టెలు తడిసి నానా ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొంటున్నారు. తడిసిన కట్టెలపై వండాలంటే పొగచూరి కళ్ల మంటలు వచ్చి నీరు కారుతుందని వివరిస్తున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు కరువయ్యారు.

ప్రతీరోజు పాఠశాల ఆవరణలోనే..

మండలంలో 40 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సన్నబియ్యంతో కూడిన భోజనం వడ్డిస్తున్నారు. ఇందుకోసం ప్రతీరోజు పాఠశాల ఆవరణలోనే భోజనం తయారు చేస్తున్నారు. వంటల తయారీకి కట్టెల పొయ్యినే ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. వారికి ఎక్కువ మొత్తంలో వండాల్సి వస్తోంది కాబట్టి కట్టెలపొయ్యి సమస్యగా మారుతుందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాకాలంలో తప్పనితిప్పలు

ప్రస్తుతం వర్షాకాలం మొదలైంది. ఈ మూడు నెలలు కట్టెల పొయ్యిపై వంటలు చేయాలంటే అవి తడిస్తే కష్టంగా ఉంటుంది. వాటిపైనే వండాలంటే కట్టెలు మండకపోగా, పొగవస్తుంటదని నిర్వాహకులు చెబుతున్నారు. కట్టెలు తడిసి మంట మండకపోవడంతో పొగచూరి ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండవస్తే గానీ కట్టెలు ఆరవు. కొన్ని చోట్ల కట్టెలు లభించకపోవడంతో మార్కెట్లో అధిక ధరలకు కొని వండాలంటే ఆర్థిక భారం కూడా తప్పడం లేదు.

ప్రతిపాదనలకే పరిమితం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించే నిర్వాహకులకు వంటగ్యాస్ సిలిండర్లు మంజూరు చేస్తామని సర్కారు జారీ చేసిన ప్రకటనలు మండలంలో ఇంకా అమలులోకి రాలేదు. గత ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్లు అందజేస్తామని ప్రకటించడంతో అప్పట్లో అధికారులు ప్రతిపాదనలు రూపొందించి సర్కారుకు పంపించారు. కానీ ఇప్పటికీ సిలిండర్ల ప్రతిపాదనకు ఊసేలేదు.

ఉన్నతాధికారులకు నివేదించాం

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కట్టెల పొయ్యిపైనే వండుతున్నారు. ఈ విషయం గురించి ఉన్నతాధికారులకు నివేదించాం. గతంలో సిలిండర్లు అవసరమున్న పాఠశాలల వివరాలు సేకరించి ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం ప్రభుత్వం మంజూరు చేస్తే పంపిణీ చేస్తాం. ఇప్పటికీ ఆయా పాఠశాలలో వంటపాత్రలు అందజేశాం.

– వెంకట్‌స్వామి, ఎంఈఓ, దౌల్తాబాద్

కిచెన్ షెడ్డు త్వరగా పూర్తి చేయాలి

ఎంఈవో విజయరామారావు



పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈవో విజయరామారావు

దుద్యాల్: మండల పరిధిలోని ఈర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో రూ. 15లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న కిచెన్ షెడ్డు, ప్రహరీ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంఈవో విజయ రామారావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. గ్రామ చివర్లో పాఠశాల భవనం ఉండడంతో రాత్రిసమయాల్లో మందు బాబులు మద్యం సేవించి సీసలు అక్కడే పడేసిన సందర్భాలను గుర్తు చేశారు. ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తయితే అలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కేశవులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సునిత, మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి నాయక్, సీఆర్‌పీ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధే లక్ష్యం



రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం తెలుపుతున్న నాయకులు

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఘణపురం వెంకటయ్య

కుల్కచర్ల: విద్యారంగాన్ని అభివృద్ధిచేసేందుకు రాజకీయాలకు అతీతంగా కృషిచేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఘణపురం వెంకటయ్య పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంలో పరిగి నియోజకవర్గ పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కుల్కచర్ల మండలంలో ఇంటిగ్రేటెడ్, పాలిటెక్నిక్ స్కూల్, ఐటీఐ, ఇంజనీరింగ్, వృత్తివిద్యాకోర్సులతో విద్యాలయాలను ఏర్పాటు చేయాలన్నారు. మారుమూల ప్రాంతాలు మెరుగైన ఫలితాలు సాధించాలంటే గ్రామీణ ప్రాంతాల్లో విద్యాసంబంధ కోర్సులతో విద్యాలయాల ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. అనంతరం పీఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ..యువతకు ఉపాధి లభించాలంటే గ్రామీణ ప్రాంతాలు విద్యారంగంలో తగిన చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, స్థానిక నాయకులు చంద్రలింగం, జానకిరాం, సౌమ్యారెడ్డి, సాయికిరణ్ గౌడ్, గుండుమళ్ల నర్సింలు, జోగు వెంకటయ్య, గాంగ్యనాయక్, మైపాల్, హరికృష్ణ, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్



సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న శ్రీనివాస్

దోమ: సీఎం సహాయనిధి పేదలకు వరమని తిమ్మాయిపల్లి దోర్నాల్‌పల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం దోర్నాల్‌పల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణ రెడ్డి, మంగళి హరిచరణ్ కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. ఈ విషయాన్ని పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించారు. సత్యనారాయణరెడ్డికి రూ. 20 వేలు, మంగళి హరిచరణ్‌కు రూ.54వేలు మంజూరైన చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేదలను ఎన్నో రకాలుగా ఆదుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు నాగేందర్‌రెడ్డి, పట్లోళ్ల వెంకట్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, హరిజన వెంకటయ్య, ఉప్పరి మొగులయ్య, గోపాల్, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

డీటీడీఓ కమలాకర్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న కమలాకర్‌రెడ్డి

బొంరాస్‌పేట: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీటీడీఓ కమలాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బొట్లోనితండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బోధన, మౌలిక వసతులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతీఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అంటు వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందుకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ విక్రం సింగ్, సిబ్బంది శరణప్ప, రాజన్న పాల్గొన్నారు.

తేనీటి విందుకు మంత్రుల హాజరు



స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబుతో శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

తాండూరు: ఆర్‌బీఓఎల్ సంస్థ సీఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన తేనీటి విందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్పీకర్ ప్రసాద్‌కుమార్ హాజరయ్యాయ్యారు. వీరి వెంట శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఉన్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

పరిగి: పాఠశాలలో ఆన్‌లైన్ ప్రక్రియలను త్వరగా పూర్తి చేయాలని మండల విద్యాధికారి గోపాల్ సూచించారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలని విద్యార్థుల ప్రగతిని నిత్యం పర్యవేక్షిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు బుక్‌లు, వర్క్ బుక్‌ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

పరిగి: గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్న పరిష్కారానికి కృషి చేస్తానని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవర్ధన్ అన్నారు. రాపోల్ గ్రామంలో మంగళవారం సొంత ఖర్చులతో పారిశుద్ధ్య పనులను చేయించారు. గ్రామంలోని వీధుల గుండా గడ్డి మందు పిచికారి చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు.

తాగునీటికి ఇక్కట్లు

పట్టించుకోని అధికారులు



పాడైన వాటర్‌ట్యాంక్

ధారూరు: తాగునీటి కోసం సబ్ స్టేషన్ కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసిన బోరు పాడై నీరు రాక, మిషన్ భగీరథ తాగు నీరు సరఫరా కాకా ధారూరు సబ్‌స్టేషన్ కాలనీ ప్రజలు వారం రోజుల నుంచి అష్టకష్టాలు పడుతున్నారు. ఈ విషయం గురించి పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు లేరు. స్థానిక ఎమ్మెల్యే శాసనసభ స్పీకర్ కావడంతో చెప్పుకునేందుకు వీలుకాక, స్థానిక కాంగ్రెస్ నాయకులు పట్టించుకోక తమ కష్టాలు వినేవారు లేకపోవడంతో మంగళవారం వారు ఆందోళన చేపట్టారు. కుక్కింద–ధారూరు రోడ్డులోని బోరు చెడిపోయి రోజులు గడుస్తున్నా బాగు చేయించే వారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరారు.

విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి

పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సౌమ్య



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న వైద్యాధికారిణి

దౌల్తాబాద్: విద్యార్థులపై జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సౌమ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బాలంపేట గ్రామంలోని కస్తూర్బా విద్యాలయంలో వైద్య శిబిరం నిర్వహించారు. అక్కడ విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేపట్టారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ప్రతీరోజు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. జ్వరం, దగ్గు వంటివి వస్తే వెంటనే స్థానిక ఏఎన్‌ఎంను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మంజుల, ఏఎన్‌ఎం తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరిస్తా

ఎంపీడీఓ రాములు



కేజీబీవీలో వంట సరుకులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాములు

బంట్వారం: కేజీబీవీ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని ఎంపీడీఓ రాములు పేర్కొన్నారు. మంగళవారం ఆయన బంట్వారం కస్తూర్బాగాంధీ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా హాస్టల్‌లో సౌకర్యాలు లేవని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అవసరమైన వసతుల కల్పనకు నివేదిక తయారుచేసి కలెక్టర్‌కు పంపిస్తానన్నారు. బాగా చదువుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. భోజనం ఎలా ఉందని వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గది, మరుగుదొడ్లను పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరుపై ఆరా తీశారు. తప్పనిసరిగా ప్రతిఒక్కరూ సమయ పాలన పాటించాలని సూచించారు. అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తానన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓ నాగరాజు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి: ఎంఈఓ చంద్రప్ప

విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈఓ చంద్రప్ప పేర్కొన్నారు. మంగళవారం ఆయన కోట్‌పల్లి మండలంలోని కొత్తపల్లి యూపీఎస్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో పాఠాలు చదివించారు. అక్షరాలను బోర్డుపై రాయించి వారి సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం హెచ్‌ఎంకు పలు సూచనలు చేశారు. ఎండీఎం, ఎఫ్‌ఎల్‌ఎన్, ఎఫ్ఎ1 తదితర అంశాలపై ఆయన వివరించారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. విద్యార్థులు ప్రతిరోజు బడికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ వెంట సీఆర్పీ నర్సింలు ఉన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్త

ఎస్‌ఐ భరత్‌రెడ్డి



మన్నెగూడ బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పూడూరు: ప్రతిఒక్కరూ ఆన్‌లైన్ మోసాలపై తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ భరత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మన్నెగూడ సంత, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్నెగూడ సంతలో తరచూ సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నాయన్నారు. కూరగాయలు అమ్మే వ్యాపారులు డబ్బులు, సెల్‌ఫోన్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బస్టాండ్, ఆటో స్టాండ్‌లలో ప్రయాణికులు తీసుకొచ్చే విలువైన వస్తువులు, డబ్బులు జాగ్రత్తగా ఉంచుకోవాలని తెలిపారు. అనుమానం వస్తే 100కు డయల్ చేయాలని సూచించారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వొదని, వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఈజీమని కోసం తెలియని యాప్స్‌ను తెరిచి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య, సిబ్బంది నగేశ్, స్వప్న, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో బోధనకు మెరుగులు



మొదటి విడత నిర్వహించిన కాంప్లెక్స్ స్థాయి సమావేశం

- నేటి నుంచి రెండోదఫా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు
- ఎజెండా అంశాలపై చర్చా

బొంరాస్‌పేట: ఉపాధ్యాయులకు వృత్త్యంతర శిక్షణలతో బోధనకు మెరుగులు దిద్దొచ్చనే ఆలోచనలతో తాజాగా జిల్లా వ్యాప్తంగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు, శిక్షణలు నిర్వహిస్తున్నారు. మండలాల్లో ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంల నిర్వహణలో మొదటి విడతగా ఈ నెల 24, 25న ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు శిక్షణ, సమావేశాలు నిర్వహించారు. రెండో విడతగా ఈ నెల 30, 31న ప్రాథమికోన్న పాఠశాల స్థాయిల్లో సమావేశాలు నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా ఈ సారి మండల స్థాయిలో నిర్వహించనున్నారు.

గ్రంథాలయాల నిర్వహణపై..

24న మొదటిరోజు సగం మంది ఎస్‌జీటీలు, రెండో రోజు మిగితా ఎస్‌జీటీలు హాజరయ్యారు. వీరికి పాఠశాల గ్రంథాలయాల నిర్వహణ, చదవడం, ఎఫ్‌ఎల్‌ఎన్, బేస్‌లైన్ అసెస్‌మెంట్, ఒకటో తరగతికి విద్యాప్రవేశ్ అనే ఎజెండా అంశాలపై చర్చా నిర్వహించారు. పాఠశాల గ్రంథాలయాలు (లైబ్రరీ కార్నర్) నిర్వహణపై మండలానికి ఇద్దరు చొప్పున ఆర్‌పీలకు జిల్లాస్థాయిలో శిక్షణ తీసుకుని దీనిపై ఈ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులకు శిక్షణఇస్తారు. కాగా పాఠశాల లైబ్రరీల నిర్వహణపై పలు సమస్యలను ఉపాధ్యాయులు చర్చించనున్నారు.

నేటి నుంచి రెండో విడత

30న ప్రాథమికోన్నత స్థాయి భాషాపండితులు, 31న సబ్జెక్టులవారీగా హాజరుకావాల్సి ఉంటుంది. వీరికి ఎల్‌ఐపీ, డిజిటల్ కంటెంట్, ఐఎఫ్‌పీ, ఉపాధ్యాయుల వ్యక్తిగత డెమో, బోధనాభివృద్ధి వంటి ఎజెండా అంశాలు ఉంటాయి. కాంప్లెక్స్ సమావేశాలు గతంలో ఎంపిక చేసిన కేంద్రాల్లోనే యథావిధిగా సబ్జెక్టులతో షెడ్యూల్డు ప్రకారం ఉంటుంది. ఈ సమావేశాలను ఎంఈఓలు, సంబంధిత కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విజయవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ రేణుకాదేవి సూచించారు.

మొక్కల పెంపకం బాధ్యత

కుల్కచర్ల: మొక్కల పెంపకాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని మరికల్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మరికల్ గ్రామంలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఇంటికి పండ్ల, పూలమొక్కలను అందజేశామన్నారు. ప్రతీ ఇంటికి ఐదు మొక్కలను అందిస్తున్నామని వాటిని నాటడంతో పాటు సంరక్షించాలని పేర్కొన్నారు.

విజయవంతం చేయాలి

అనంతగిరి: కొడంగల్‌లోని మురారి ఫంక్షన్ హాల్లో ఆగస్టు 2న నిర్వహించనున్న వికలాంగుల చేయూత పెన్షన్ దారుల జిల్లా మహాసభను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ గౌరవ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం వికారాబాద్‌లో జిల్లా ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ విచ్చేయనున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలముందు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచాలని కోరారు. అధికారంలోకి వచ్చి 20 నెలలు కా వస్తున్నా ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేకపోతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జాతీయ అ.ధ్యక్షుడు నాగరాజు, ఎంఎస్‌ఎఫ్ అధ్యక్షుడు సోమశేఖర్, జిల్లా అధ్యక్షుడు ఆనంద్, వీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు శ్యాంప్రసాద్, పెన్షన్‌దారుల అధ్యక్షురాలు మంజుల, ఉపాధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు.